మొదటి రోజు సాఫీగా..

- ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు
- 97.44 శాతం విద్యార్థుల హాజరు
- పరీక్షా కేంద్రాల ను తనిఖీ చేసిన అధికారులు
- కేంద్రాల వద్ద పోలీసుల పటిష్ట బందోబస్తు

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, మార్చి 5: ఇంటర్ వార్షిక పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. మొదటి రోజు 97.44శాతం విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. కేంద్రాల వద్ద సందడి వాతావరణం నెలకొంది. ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల వద్దకు విద్యార్థులు వారి తల్లిదండ్రులు ఉదయం 8గంటలకే చేరుకున్నారు. ప్రతివిద్యార్థి హాల్ టికెట్స్‌తోపాటు క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే అధికారులు అనుమతించారు. ప్రథమ సంవత్సరం విద్యార్థులకు మొదటి రోజు నిర్వహించిన సెకండ్ లాంగ్వేజ్ పేపర్-1 (తెలుగు, హిందీ, సాంస్కృతి, ఆరబిక్)కు జనరల్ కేటగిరీలో 9323 మందికి 9124 మంది హాజరయ్యారు. ఒకేషనల్ విద్యార్థులు 2086 మందికిగానూ 1993 హాజరయ్యారు. కేంద్రాలను డీఐఈవో కౌసర్‌జహాన్, సంబంధిత అధికారులు ఆకస్మికంగా తనిఖీలు చేశారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. ఈనెల 6వ తేదీ నుంచి ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు పరీక్షలు ప్రారంభం కానున్నాయి.

మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రంలోని బాలికల కళాశాల పరీక్షా కేంద్రంలోకి వరుస క్రమంలో వెళ్తున్న విద్యార్థినులు

జడ్చర్లలో 41మంది గైర్హాజరు

జడ్చర్లటౌన్, మార్చి 5: జడ్చర్లలోని మొత్తం 5 కేంద్రాల్లో మొత్తం 1,297 మంది విద్యార్థులకు 1,256 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా, 41 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. పరీక్షా కేంద్రాల్లో ఒక్కో విద్యార్థిని క్షుణ్ణంగా తనిఖీ చేసి హాల్‌లోకి అనుమతించారు. అదేవిధంగా పరీక్ష కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు నిర్వహించారు. ఆయా పరీక్ష కేంద్రాల్లో విద్యార్థుల సౌకర్యార్థం ఏర్పాట్లుగావించారు.

మిడ్జిల్ మండలంలో..

మిడ్జిల్, మార్చి 5: మండల కేంద్రంలోని జూనియర్ కళాశాలలో బుధవారం ఇంటర్, పారామెడికల్ ఒకేషనల్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. ప్రథమ సంవత్సరంలో 178 మంది విద్యార్థులకు 173 మంది హాజరైనట్లు ప్రిన్సిపాల్ తిరుపతయ్య తెలిపారు.

14మంది విద్యార్థులు గైర్హాజరు

మహ్మదాబాద్, మార్చి 5: ఇంటర్ ప్రథమ సంవత్సరం మొదటిరోజు పరీక్షలకు 14 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ సుగ్నేశ్, గురుకుల ప్రిన్సిపాల్ రమా తెలిపారు. మండలంలో రెండు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయగా.. నంచర్ల గురుకుల పాఠశాలలో 350 విద్యార్థులను కేటాయించగా 345 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. మహ్మదాబాద్ జూనియర్ కళాశాలలో 229 విద్యార్థులను అలాట్ చేయగా 220 మంది హాజరయ్యారు.

నారాయణపేట జిల్లాలో..

నారాయణపేట రూరల్, మార్చి 5: ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు బుధవారం జిల్లాలో ప్రశాంతంగా కొనసాగాయి. జిల్లాలో మొత్తం 16 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా.. 3,888 మంది జనరల్ విద్యార్థులను అలాట్ చేయగా 3,767 మంది హాజరయ్యారు. 121మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఒకేషనల్ పరీక్షలకు 588 మంది విద్యార్థులను అలాట్ చేయగా 569 మంది హాజరుకాగా.. 19మంది గైర్హాజరయ్యారు. పేటలోని సాయి కళాశాల పరీక్ష కేంద్రాన్ని అదనపు కలెక్టర్ బెన్‌షాలం పరిశీలించారు. పేట తోపాటు పలు పరీక్ష కేంద్రాలను డీఎస్పీ లింగయ్య పరిశీలించారు. ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం దామరగిద్ద, మద్దూరు, కోస్గి, డీఈసీ కన్వీనర్ నారాయణపేట, డీఈసీ మెంబర్లు ఊట్కూర్, మక్తల్, మాగనూర్, డిస్ట్రిక్ట్ బల్క్ ఇన్‌చార్జి మరికల్, ధన్వాడ సిట్టింగ్ స్క్వాడ్ బృందం మక్తల్ పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. పరీక్షలన్నీ ప్రశాంతంగా జరిగినట్లు డీఐఈవో సుదర్శన్‌రావు తెలిపారు.

మరికల్ మండలంలో..

మరికల్, మార్చి 5: ఇంటర్ పరీక్షలు బుధవారం మరికల్‌లో ప్రశాంతగా సాగాయి. మండల కేంద్రంలోని సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలలో నిర్వహించిన కేంద్రంలో మొత్తం 257 మంది విద్యార్థులు పరీక్షలు రాసినట్లు ప్రిన్సిపాల్ నాగమణిమాల తెలిపపారు.

తొలిరోజు 28మంది విద్యార్థుల గైర్హాజరు

మక్తల్, మార్చి 5: ఇంటర్ ఫస్టీయర్ పరీక్షలు తొలిరోజు మక్తల్‌లో ప్రశాంతంగా కొనసాగాయని పరీక్షల కస్టోడియం ఆఫీసర్ రామస్వామి తెలిపారు. మక్తల్‌లో మూడు కేంద్రాలను ఏర్పాటు చేయగా.. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 308 విద్యార్థులకు 301, మైనార్టీ గురుకుల కళాశాలలో 384 మందికి 376, స్కాలర్స్ జూనియర్ కళాశాలలో 331మందికి 318మంది హాజరయ్యారు.

పేటలోని పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థుల హాల్ టికెట్లను పరిశీలిస్తున్న అధికారులు

మెరుగైన వైద్యం అందించాలి

- మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

వైద్యులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్ అర్బన్, మార్చి 5: మహబూబ్‌నగర్ రూరల్ మండలం ఫతేపూర్‌కు చెందిన కమ్మరి శ్రీనివాసులుచారిని రోడ్డు ప్రమాదంలో గాయపడి హైదరాబాద్ ఉస్మానియా దవాఖానలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ బుధవారం ఉస్మానియాకు చేరుకుని బాధితుడిని పరామర్శించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులుచారికి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. ఆందోళన చెందకుండా ధైర్యంగా ఉండాలని, బీఆర్ఎస్ అండగా ఉంటుందని బాధితుడికి మనోధైర్యం చెప్పారు.

ప్రమాదరహిత జిల్లాగా తీర్చిదిద్దాలి

- రాష్ట్ర రవాణాశాఖ కమిషనర్ సురేంద్రమోహన్

అధికారులతో మాట్లాడుతున్న రవాణాశాఖ కమిషనర్ సురేంద్రమోహన్

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, మార్చి 5: రహదారులపై ప్రమాదాల నివారణకు అన్ని శాఖల అధికారులు పూర్తి సమన్వయంతో భద్రతా చర్యలు తీసుకోవాలని ప్రమాద రహిత పాలమూరు జిల్లాగా తీర్చిదిద్దాలని రాష్ట్ర రవాణాశాఖ, సహకార శాఖ కమిషనర్ సురేంద్రమోహన్ కోరారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ మీటింగ్ హాల్‌లో కలెక్టర్ విజయేందిర బోయి, ఎస్పీ జానకి, ఉమ్మడి జిల్లా రవాణాశాఖ అధికారి, ట్రాన్స్‌పోర్టు డిప్యూటీ కమిషనర్ కిషన్, సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ప్రమాదాల నివారణకు జిల్లా టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశాలు, తీసుకుంటున్న చర్యలపై సమీక్షించారు. ప్రమాదాలు, నివారణ, భద్రతా చర్యలపై సుప్రీంకోర్టు కమిటీకి నివేదిక సమర్పించాల్సి ఉంటుందని, ఈ అంశంపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలన్నారు. ఈ ఏడాది 108 రోడ్డుప్రమాదాలు జరిగినట్లు నివేదికలు చెబుతున్నాయని, అందుకు సంబంధించిన డేటాను అప్‌లోడ్ చేయాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల బారిన పడుతున్న వారిలో యువత 18.2శాతం ఉన్నారన్నారు. పాఠశాల, కళాశాల విద్యార్థినీ, విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించాలని కోరారు. సమావేశంలో జాయింట్ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ చంద్రశేఖర్‌గౌడ్, అదనపు కలెక్టర్ మోహన్‌రావు, ఆర్‌అండ్‌బీ ఈఈ దేశ్యానాయక్, పోలీసు, రవాణా, జాతీయ రహదారులు, వైద్యారోగ్యశాఖ, ఆర్‌అండ్‌బీ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అలవాటుగా.. వార్తాపత్రికలు చదవాలి

- మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మత్స్యకారులకు రిజిస్ట్రేషన్ పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే యెన్నం

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ, మార్చి 5: వార్తాపత్రికలు చదవడం అలవాటుగా మార్చుకోవాలని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మహిళా డిగ్రీ కళాశాల, మెట్టుగడ్డలోని బీఈడీ కళాశాల, పిల్లలమర్రి సమీపంలోని సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎన్టీఆర్ కళాశాలలో దేశ్‌పాండే ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. అంతకుముందు ఆయా కళాశాలలు, గురుకుల విద్యాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్వోప్లాంట్‌ను ప్రారంభించారు. కార్యక్రమాల్లో గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రాజేంద్రప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ అనురాధ, అమీనా ముంతాజ్ జహాన్, అధ్యాపకులు కేశవర్ధన్‌గౌడ్, మద్దిలేటి, మధుసూదన్, బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ గోవిందరాజులు, అధ్యాపకులు గులాంమైనొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుల సంక్షేమానికి కట్టుబడి

పాలమూరు, మార్చి 5: మత్స్యకారుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం రూరల్ మండలంలోని దివిటిపల్లిలో నూతనంగా ఏర్పడిన ప్రాథమిక మత్స్యకార సహకార సంఘం రిజిస్ట్రేషన్ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముదిరాజ్ సంఘం కమ్యూనిటీ భవనాన్ని ముడా నిధులతో నిర్మిస్తామని, అందుకు ఎస్టిమేషన్ తయారు చేసి ఇవ్వాలని ముదిరాజ్ సంఘం సభ్యులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా మత్స్యకారుల సంఘం అధ్యక్షుడు ఆంజనేయులు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పెద్ద విజయ్‌కుమార్, డీసీసీ ప్రధానకార్యదర్శి సిరాజ్‌ఖాద్రీ తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

సాధారణ ప్రజలకు ఇందుమూలంగా తెలియజేయునదేమనగా, శ్రీ మీర్జా అర్షద్ బేగ్ తండ్రి మీర్జా కరీం బేగ్, నివాసం: మహబూబ్‌నగర్ వారు దిగువ తెలిపిన ఆస్తి తనఖా ద్వారా ఆర్థిక సహాయం పొందుటకు బ్యాంకును సంప్రదించారు మరియు సదరు ఆస్తికి సంబంధించి అతని టైటిల్ డీడ్‌కు చెందిన లింక్ డాక్యుమెంట్లలో ఒకటి అయిన ఒరిజినల్ రిజిస్టర్డ్ సేల్ డీడ్ డాక్యుమెంట్ నెం.533/1998 పోయినదని మరియు సదరు ఆస్తిపై ఎలాంటి తాకట్టు రుణభారాలు లేవని బ్యాంకుకు తెలియజేశారు. ఎవరైనా వ్యక్తి లేదా వ్యక్తులు సదరు ఆస్తిపై ఏదేని హక్కు, లేదా సదరు ఆస్తి సెక్యూరిటీపై అతనికి రుణం మంజూరుపై ఏవేని అభ్యంతరాలు ఉన్నచో వారు నేటి నుండి పది రోజులలోగా వారి అభ్యంతరాలను తెలియజేయవలెను. ఎలంగా అభ్యంతరాలు అందనిచో దిగువ తెలిపిన షెడ్యూల్ ఆస్తి సెక్యూరిటీపై రుణం మంజూరు నిమిత్తం శ్రీ మీర్జా అర్షద్ బేగ్ అభ్యర్థనను సదరు ఆస్తిపై ఎలాంటి మూడవ పార్టీ క్లెయింలు లేవని భావించి పరిగణలోకి తీసుకోబడును. పై సదరు ఒరిజినల్ డాక్యుమెంట్ ఎవరి స్వాధీనంలో ఉన్నా అతనికి తిరిగి అప్పగించగలరు.

షెడ్యూల్ ఆస్తి

హబీబ్‌నగర్, బండమీది పల్లి H/o మహబూబ్‌నగర్ (Vg), మహబూబ్‌నగర్ అర్బన్ మండలం, మహబూబ్‌నగర్ జిల్లా వద్ద గల సర్వే నెం.687లో ప్లాట్ నెం.29పై నిర్మించబడిన, 200 చ.గజాల విస్తీర్ణం ఇం.నెం.6-3-44/1/ఇ, సరిహద్దులు: ఉత్తరం: సయ్యద్ మక్బూద్ ప్లాట్ నెం.18, దక్షిణం: 20' రోడ్, తూర్పు: ప్లాట్ నెం.22, పడమర: ప్లాట్ నెం.24.
తేది: 04.03.2025

K. PRATAP KUMAR B.Com., LL.B.,
Advocate
Krishna Nivas, H.No.1-4-130/A/7/B,
Kamalanehru Colony, Bayamma Thota,
Mahabubnagar . Cell No.9848069541

వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ పోస్టర్ ఆవిష్కరణ

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, మార్చి 5: వికసిత భారత్ యూత్ పార్లమెంట్ నిర్వహించడానికి నోడల్ కేంద్రంగా మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రం సమీపంలోని క్రిస్టియన్‌పల్లిలోని ఎంవీఎస్ కళాశాల ఎంపిక కావడం సంతోషించదగ్గ పరిణామమని పీయూ వైస్‌చాన్స్‌లర్ జీఎన్.శ్రీనివాస్ అన్నారు. బుధవారం పీయూ వీసీ చాంబర్‌లో రిజిస్ట్రార్ చెన్నప్ప, ఎంవీఎస్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పద్మావతితో కలిసి వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్-2025 పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడారు. 18-25ఏండ్లలోపు విద్యార్థులు ఈనెల 9వ తేదీలోగా యూత్ పార్లమెంట్‌లో పాల్గొనేందుకు మైభారత్ పోర్టల్‌లో రిజిస్టర్ చేసుకోవాలన్నారు. రాజ్యాంగం ద్వారా గుర్తింపు పొందిన ఏ భాషలోనైనా 'ప్రజాస్వామ్యం'పై అవగాహనతో ఒక నిమిషం నిడివి గల వీడియోను అప్‌లోడ్ చేయాలన్నారు. కార్యక్రమంలో జాతీయ సేవా పథకం ప్రోగ్రాం అధికారులు కోఆర్డినేటర్లు సుభాషిణి, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరిస్తున్న వీసీ, రిజిస్ట్రార్, ప్రిన్సిపాల్

మహిళా దినోత్సవ పోస్టర్ ఆవిష్కరణ

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, మార్చి 5: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఈనెల 6, 7 తేదీల్లో హైదరాబాద్ దోమలగూడ ప్రభుత్వ కాలేజ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ గ్రౌండ్, మహబూబ్‌నగర్ జిల్లావ్యాప్తంగా క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ సెంటర్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామకృష్ణా గౌడ్ తెలిపారు. ఈ మేరకు బుధవారం మహిళా దినోత్సవ వేడుకల వాల్‌పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ విజయేందిరబోయి, ఎస్పీ జానకి చేతుల మీదుగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీజీవో జిల్లా మహిళా చైర్‌పర్సన్ సంధ్య, కన్వీనర్ చంద్రకళ, టీజీవో జిల్లా అధ్యక్షుడు విజయ్‌కుమార్, సెక్రటరీ వరప్రసాద్, కోశాధికారి టైటస్‌పాల్, లావణ్య, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్, ఎస్పీ, టీజీవో రాష్ట్ర, జిల్లా నాయకులు

కష్టపడి చదవి తల్లిదండ్రులకు పేరు తేవాలి

- ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

మూసాపేట(అడ్డాకుల)/దేవరకద్ర రూరల్(కౌకుంట్ల)/దేవరకద్ర, మార్చి 5: కష్టపడి చదివి 10వ తరగతిలో ఉన్నత మార్కులు సాధించి తల్లిదండ్రులు, గ్రామానికి మంచిపేరు తేవాలని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి సూచించారు. అడ్డాకుల మండలంలోని పోన్నకల్, కౌకుంట్ల మండలం అప్పంపల్లి జెడ్పీ హెచ్ఎస్, దేవరకద్ర జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్స్, సైకిల్స్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యాభివృద్ధికి తనవంతు కృషిచేస్తున్నానని చెప్పారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు సులువుగా అర్థమయ్యేవిధంగా విద్యాబోధన చేయాలని సూచించారు. అలాగే మూసాపేట జెడ్పీహెచ్ఎస్‌లో గ్రామానికి చెందిన బాలమ్మ, బాల నారాయణ దంపతుల జ్ఞాపకార్థం వారి కుమారులు రాజేందర్, సునీత రూ.10లక్షలు ఖర్చు పెట్టి నిర్మించిన అదనపు తరగతి గదిని బుధవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం దాతలను ఎమ్మెల్యే సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈవో రాజేశ్వర్‌రెడ్డి, తాసీల్దార్ కృష్ణయ్య, ఎంపీడీవో శ్రీనివాస్‌రావు, ఎంఈవో బాలరాం, శెట్టి శేఖర్, బాలనర్సింహులు, గడ్డం మహేందర్, ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలు, అధ్యాపక బృందం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సైకిళ్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జీఎంఆర్

జిల్లాకు చేరిన నూతన జాగిలం

నారాయణపేట, మార్చి 5: హైదరాబాద్‌లోని మొయినాబాద్‌లో 9నెలలపాటు కఠోర శిక్షణను పూర్తి చేసుకొన్న నూతన జాగిలం లక్కి బుధవారం పేటకు చేరింది. నూతన జాగిలం లక్కి, డాగ్ హ్యాండ్లర్ భగవంతు ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ యోగేశ్‌గౌతమ్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. తెలంగాణ, త్రిపుర, బీహార్, గోవా రాష్ట్రాలకు చెందిన 32 డాగ్స్ పేలుడు పదార్థాలు గుర్తించడంలో పోటీ పడగా పేట జిల్లాకు చెందిన డాగ్ లక్కి, డాగ్ హ్యాండ్లర్ భగవంతుకు గోల్డ్ మెడల్ వచ్చినట్లు పేర్కొన్నారు. జిల్లాలో అంతర్గత భద్రతలో కీలక పాత్ర పోషించనున్న జాగిలాల బృందానికి మరో జాగిలం రావడం అదనపు బలంగా పేర్కొన్నారు. అనంతరం గోల్డ్ మెడల్, ప్రశాంసా పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆర్ఐ నర్సింహా, డాగ్ స్క్వాడ్ బృందం ఇన్‌చార్జి రాజేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ

నవాబ్‌పేట, మార్చి 5: మండలంలోని గురుకుంట, ధర్పల్లికి చెందిన ఉపాధిహామీ కూలీలకు బుధవారం ఎంపీడీవో జయరామ్‌నాయక్ ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఆయా గ్రామ శివార్లలో పనిచేస్తున్న కూలీల వద్దకు వెళ్లి.. కూలీలతో మాట్లాడారు. వేసవిలో ఉదయం 7గంటల నుంచి 10గంటల వరకే ఉపాధి పనులు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీవో జ్యోతి, ఎఫ్ఏ వెంకటేశ్ ఉన్నారు.

ధన్వాడ మండలంలో..

ధన్వాడ, మార్చి 5: మండల కేంద్రంలో బుధవారం ఉపాధి కూలీలకు ఎంపీడీవో సాయిప్రకాశ్ ఓఆర్ఎస్, మజ్జిగా ప్యాకెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీఏ సిద్దేశ్వర్, మేటీ ఆంజనేయులు, కార్యదర్శి శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

పంటల సస్యరక్షణపై అవగాహన

మరికల్, మార్చి 5: పంటల సాగు, పురుగుల నివారణపై బుధవారం కేంద్రీయ సమగ్ర సస్యరక్షణ కేంద్రం హైదరాబాద్ శాస్త్రవేత్తలు రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు మాట్లాడుతూ.. పంటల్లో పురుగుల నివారణ, విత్తనశుద్ధి, ఎరువుల వాడకం, మందుల పిచికారీ విధానంపై రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు సునీత, వెంకట్‌రెడ్డి, బసవన్న, ఉదయ్‌శంకర్, జిల్లా వ్యాపసాయ శాఖధికారి జాన్ సుధాకర్, ఏవో రహమాన్, ఏఈవో పరశురాం, రైతులు పాల్గొన్నారు.

అంబలి కేంద్రం ప్రారంభం

జడ్చర్లటౌన్, మార్చి 5: పట్టణంలోని ఎస్‌బీఐ ఎదురుగా మంద జయమ్మ జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన అంబలి కేంద్రాన్ని బుధవారం జడ్చర్ల మున్సిపల్ చైర్‌పర్సన్ కోనేటి పుష్పలత ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ సారిక, కౌన్సిలర్ సతీశ్, నందకిశోర్‌గౌడ్, ప్రశాంత్‌రెడ్డి, శశికిరణ్, బీఆర్ఎస్ నాయకులు రామ్మోహన్, పరమటయ్య, కృష్ణారెడ్డి, నిర్వాహకులు జైపాల్‌రెడ్డి, భాగ్యలక్ష్మి, రంగరాములు తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

నారాయణపేట టౌన్, మార్చి 5: యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని నషా ముక్త్ భారత్ వలంటీర్లు లక్ష్మీకాంత్, సంధ్య అన్నారు. బుధవారం పట్టణంలోని మైనార్టీ గురుకుల పాఠశాలలో జిల్లా వికలాంగులు వయోవృద్ధులు, ట్రాన్స్‌జెండర్స్ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు మాదకద్రవ్యాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఖాజా మహబూబ్‌ఖాన్, విద్యార్థులు పాల్గొన్నారు.

తాగిన మైకం ప్రాణం తీసింది

- వ్యక్తి హత్యకేసులో నిందితుడు అరెస్టు
- మహబూబ్‌నగర్ డీఎస్పీ వెంకటేశ్వర్లు

జడ్చర్లటౌన్, మార్చి 5: తాగిన మైకంలో ఎదుటి వ్యక్తితో గొడవపడడంతో ఇరువురి మధ్య మాటామాట పెరిగి ప్రాణం తీసేలా దారితీసింది. జడ్చర్లలోని బి.ఆర్.రెడ్డి పంక్షన్ గది బాత్‌రూంలో అనుమానాస్పదంగా మృతిచెందిన వ్యక్తి కేసులో జడ్చర్ల పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు. జడ్చర్ల పోలీసుస్టేషన్‌లో బుధవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ వెంకటేశ్వర్లు వివరాలు వెల్లడించారు. బీహార్‌కు చెందిన రషీద్‌ఖాన్(26) కొంతకాలంగా జడ్చర్ల పరిసరాల్లో విర్చోకంపెనీలో కూలీ పని చేసుకుంటూ బీఆర్ రెడ్డి ఫంక్షన్‌హాల్ బిల్డింగ్‌లో ఓ గదిని అద్దెకు తీసుకొని తోటి క్రేన్ ఆపరేటర్స్‌తో కలసి ఉంటున్నాడు. ఈ క్రమంలో విర్చో కంపెనీలో క్రేన్ రిపేరు నిమిత్తం యూపీలోని గోరఖ్‌పూర్‌కు చెందిన వినయ్ క్రేన్ ఆపరేట్స్ నివాసముంటున్న బిల్డింగ్‌కు వచ్చాడు. ఈనెల 24వ తేదీన రాత్రి వినయ్ బిల్డింగ్ మెట్ల మీద నుంచి కిందికి దిగుతుండగా, అదే సమయంలో రషీద్‌ఖాన్ ఎదురుపడ్డాడు. ఈ క్రమంలో ఇరువురి మధ్య తాగిన మైకంలో గొడవ చోటుచేసుకుని మాటామాట పెరిగింది. వినయ్ క్షణికావేశంలో రషీద్‌ఖాన్‌ను ఓ గదిలోకి తీసుకెళ్లి అతడి తలను గోడకు బలంగా కొట్టి, కిందపడేసి జీన్స్ ప్యాంటుతో మెడకు చుట్టి చంపాడు. ఆ తర్వాత మృతదేహాన్ని బాత్‌రూంలో పడేసి పారిపోయాడు. ఈనెల 25 తేదీన ఉదయం తోటి క్రేన్ ఆపరేటర్స్ గది బాత్‌రూంలో పడి ఉన్న రషీద్‌ఖాన్ మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. డీఎస్పీ వెంకటేశ్వర్లు, జడ్చర్ల సీఐ కమలాకర్ ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో ఘటనా స్థలంలో లభించిన ఆధారాల మేరకు విచారణ జరిపి నిందితుడి ఆచూకీని గుర్తించారు. బుధవారం హైదరాబాద్‌లోని ఎంజీబీఎస్‌లో నిందితుడు ఉన్నట్లు గుర్తించి జడ్చర్ల ఎస్సై మల్లేశ్, కానిస్టేబుల్ నర్సింహ అక్కడికెళ్లి నిందితుడిని అదుపులోకి తీసుకొని జడ్చర్ల ఠాణాకు తరలించి, విచారించగా నేరాన్ని అంగీకరించాడు. ఈ మేరకు నిందితుడిని అరెస్టు చేసి జడ్చర్ల కోర్టులో హాజరుపర్చనున్నట్లు డీఎస్పీ తెలిపారు. సమావేశంలో సీఐ కమలాకర్, ఎస్సైలు మల్లేశ్, జయప్రసాద్, చంద్రమోహన్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు

'పది' విద్యార్థులకు వీడ్కోలు

మహ్మదాబాద్, మార్చి 5: మండల కేంద్రంలో ఏటీఆర్ ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థులకు బుధవారం వీడ్కోలు కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ట్రప్మా జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్, వర్కింగ్ ప్రెసిడెంట్ రాంచందర్, వాగ్దేవి కరస్పాండెంట్ వెంకట్‌రెడ్డి హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారరు. అనంతరం కరస్పాండెంట్ అంజిరెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు చక్కగా పరీక్షలు రాసి మంచి మార్కులు సాధించాలన్నారు. 580మార్కులు సాధించిన విద్యార్థులకు రూ.25వేల నగదును బహుమతిగా ఇస్తామన్నారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. కార్యక్రమంలో మల్లికార్జున్, అథాహర్ అహ్మద్, రాములు, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

చిరుత దాడితో బర్రెదూడ హతం

మద్దూర్ (కొత్తపల్లి)మార్చి 5: ఉమ్మడి మద్దూర్ మండలంలోని శివారు గ్రామాల్లో చిరుతలు స్వైర విహారం చేస్తున్నాయి. వరుసగా పొలాల వద్ద ఉంచిన మూగజీవాలపైన దాడులు చేస్తూ రైతులకు కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయి. మండలంలోని మోమినాపూర్‌కు చెందిన గూళ్ల హనుమంతు గ్రామ శివారులోని పొలం వద్ద బర్రె దూడను కట్టి మంగళవారం రాత్రి ఇంటికి వచ్చాడు. బుధవారం తెల్లవారుజామున పొలానికి వెళ్లి చూడగా బర్రెదూడపై చిరుత దాడి చేసిందని తెలిపాడు. పొలాలకు రైతులు రాత్రిళ్లు రావాలంటేనే భయాందోళనకు గురుపుతున్నామని ఆరోపిస్తున్నారు.

ఉచితంగా ఇసుక సరఫరా చేయాలి

మహబూబ్‌నగర్ అర్బన్, మార్చి 5: ఇసుకపై ప్రభుత్వం విధించిన నిషేధాన్ని ఎత్తివేసి ఉచితంగా సరఫరా చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం, సీఐటీయూ నాయకులు డిమాండ్